క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు ఆహ్వానం



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో నిర్వహించనున్న పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణోత్సవానికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి ఆహ్వాన పత్రిక అందజేశారు. జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, మండెపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సన్మానం



చిన్నారులను సన్మానిస్తున్న కళాకారులు

వేములవాడఅర్బన్: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన ప్రముఖ కొరియోగ్రాఫర్ పొందుర్తి ఉమేశ్– కావ్య దంపతుల కుమారులు భవన్ష్ లవన్ తారక్ ఆదివారం హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో నిర్వహించిన జీ తెలుగు వారి డ్రామా జూనియర్స్ సీజన్ 7 అడిషన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. వీరిని పట్టణంలోని జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య ప్రధాన కార్యాలయంలో చిన్నారులను ఘనంగా సన్మానించారు. చిన్నారులు రానున్న రోజుల్లో చదువుతో పాటు కళారంగంలో మంచి ఆర్టిస్టులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు యెల్ల పోశెట్టి, జిల్లా అధ్యక్షుడు సావపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి వారాల దేవయ్య, తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని జా మా మసీదులో సోమవారం ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు. మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఎండనుంచి రక్షణ



వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తుల్లో అత్యధికులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లిస్తుంటారు. భక్తులు ఉపవాసంతో ఇబ్బందులు పడకుండా ఉండాలని, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు క్యూలైన్ల చుట్టూ ఇలా మ్యాట్‌ను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందనున్నారు.

డ్రైనేజీపై కూలిన పైకప్పు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పైకప్పు కూలడంతో ప్రమాదకరంగా మారిందని ఎంపీటీసీ కంచం మంజుల ఎంపీడీవో భాస్కరశర్మకు సోమవారం ఫిర్యాదు చేశారు. ద్విచక్రవాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. దీంతో ఎంపీడీవో డ్రైనేజీని పరిశీలించేందుకు సీనియర్ అసిస్టెంట్ సురేశ్‌ను అక్కడికి పంపించారు. వెంటనే డ్రైనేజీపై కప్పు నిర్మాణం చేపడుతామని సురేశ్ పేర్కొన్నారు. ఆయన వెంట నర్సింలు తదితరులున్నారు.

నకిలీ స్టాంపుల కేసులో నలుగురి రిమాండ్

చందుర్తి: నకిలీ స్టాంపులు తయారు చేసిన నలుగురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ గాండ్ల వేంకటేశ్వర్లు తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం ... మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన బుర్ర వెంకటేశం బ్యాంకు రుణం కోసం ఇదే మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సాయి ప్రణీత్‌ను సంప్రదించాడు. ఇతను కోరుట్ల పట్టణానికి చెందిన పృథ్వీతో పాటు కరీంనగర్‌కు వెంకటేశ్‌తో కలిసి నకిలీ స్టాంపులు సృష్టించారు. బ్యాంకు రుణం కోసం జోగాపూర్‌కు చెందిన బుర్ర వెంకటేశం నకిలీ పత్రాలు తయారు చేయించాడు. రుణం పొందేందుకు రుణాన్ని బ్యాంకు ఫీల్డ్ అసిస్టెంట్ డాక్యుమెంట్ విచారణ కోసం పంచాయతీ కార్యదర్శి కవిత వద్దకు వెళ్లగా తమ సంతకాన్ని ఫోర్జరీ చేశారని గుర్తించి ఫిర్యాదు చేసింది. కార్యదర్శి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నియామకం

చందుర్తి: బీజేపీ ఎస్టీ మోర్చా అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జిగా తిరుపతి నాయక్‌ను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల దేవుని తండాకు చెందిన తిరుపతి నాయక్‌ను పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నియమించినట్లు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

- పని ఒత్తిడిలో ప్రత్యేకాధికారులు
- ఒక్కో అధికారికి రెండు జీపీల పాలనా బాధ్యతలు
- గ్రామాల్లో తిష్టవేస్తున్న సమస్యలు



గంభీరావుపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



సర్మాలలో ఎండిపోతున్న హరితహారం మొక్కలు

గంభీరావుపేట: సర్పంచుల పదవీకాలం ముగియడంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. గెజిటెడ్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించింది. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సరిపడా అధికారులు లేకపోవడంతో ఒక్కో అధికారికి రెండేసి జీపీలకు పాలనా బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేకాధికారులకు శాఖాపరమైన బాధ్యతలు, పని ఒత్తిడి కారణంగా వారు పల్లెల్లో పర్యటించడం ఇబ్బందిగా మారింది. ఫలితంగా గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీలు, రోడ్లు శుభ్రం చేయడంలో జాప్యం జరుగుతోంది. హరితహారం కింద నాటిన మొక్కలకు సకాలంలో నీరందకపోవడంతో ఎండిపోయే దశకు చేరుతున్నాయి.

పనిఒత్తిడి..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల నిర్వహణలో ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకంగా ఉండనుంది. గెజిటెడ్ హోదాలో ఇప్పటికే సొంత శాఖలో చేయాల్సిన విధులతో పాటు అదనంగా గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టడంతో పని ఒత్తిడి పెరిగిందని కొందరు అధికారులు వాపోతున్నారు. గ్రామాలను సందర్శించేందుకు సమయం లేక పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడుతూ పనులు చేయిస్తున్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

సర్పంచుల పదవీకాలం ముగియడంతో తమ పాలన కాలంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరవుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీలకు నిధులు రాకపోవడంతో దాదాపు ఆరు నెలలపాటు వారు తమ సొంత డబ్బులు వెచ్చించారు. ఒక్కొక్కరికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. మేజర్, ఇతర పెద్ద గ్రామపంచాయతీల్లో ఇంకా ఎక్కువగానే ఉంటుంది.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. మాకు కేటాయించిన జీపీ పరిధుల్లో పర్యటిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమావేశాలకు హాజరవుతున్నాం. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల విషయం ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– రాజేందర్, ఎంపీడీవో, గంభీరావుపేట

సమస్యలపై దృష్టిసారించాలి



గ్రామంలో నెలకొన్న తాగు నీరు, పారిశుధ్యంతో పాటు హరితహారం మొక్కలకు నీరందించే పనులపై ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి. వేసవిని దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలి. నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి. గ్రామంలో డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలి.

– రాగిశెట్టి నారాయణ, గంభీరావుపేట

ఎండిన పంటలకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

చందుర్తి: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతనునిర్వహించారు. జెడ్పీటీసీ నాగం కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నీరు లేక ఎండిన పంటపొలాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సభ్యులు డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ జీరో బిల్లులు రావడం లేదని లింగంపేట ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు ప్రశ్నించారు. మండలకేంద్రంలో చెత్తను సేకరించడం లేదని, చందుర్తి – రామన్నపేట వైపు వెళ్లేదారిలో ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు తీయించి, పూడ్చడం మరిచారని మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ అధికారులకు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే గ్రామపంచాయతీ బావుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని అధికారులు పేర్కొన్నారు. 2014 కన్నా ముందు ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులు పరిహారం తీసుకొని, బావులను వినియోగించుకుంటున్నారని , భూములు కోల్పోని వారు కూడా పరిహారం పొందారని, విచారణ చేపట్టి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లింగంపేట ఎంపీటీసీ సభ్యుడు రమేశ్‌రావు డిమాండ్ చేశారు. ఎంపీపీ లావణ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు నెలల పాలన అధ్వాన్నంగా ఉందని, గ్రామాల్లో చెత్తా చెదారం పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మందాల అబ్రహం, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, వైద్యాధికారి సంపత్, వ్యవసాయాధికారి దుర్గారాజు, ఐకేపీ ఏపీఎం రజిత, ఎంపీటీసీ లు కవిత, వేణు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



సిరిసిల్లటౌన్: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత అన్నారు. సోమవారం సిరిసిల్లలోని పలువార్డుల్లో నూతన కమిటీలను నియమించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ పక్షాన నిలుస్తారన్నారు. సీనియర్ నాయకురాలు మడుపు శ్రీదేవి,పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, రమాదేవి, సానియా, కోడం అరుణ, సుధ, రోజా తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

బోయినపల్లి: బోయినపల్లి గ్రామ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బోయిని రాజు, చీఫ్ సెక్రటరీగా బిల్ల మల్లేశం, వైస్ చైర్మన్లుగా గుంటి తిరుపతి, యాద అంజయ్య, కోశాధికారిగా నల్లగొండ అనిల్, సహాయ కార్యదర్శులుగా మాడిశెట్టి శ్రీనివాస్, పత్రి సంపత్, ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా పెగ్గెర్ల శేఖర్, ఎడపెల్లి రాజు, యాద ఆదిత్య, బొజ్జ మధు, సభ్యులుగా నల్లగొండ శ్రీనివాస్, మొండయ్య, సలహాదారులుగా మల్లారెడ్డి, మల్లేశం, మల్లయ్య, భూమయ్య, సందీప్, మల్లయ్య, కన్వీనర్‌గా మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్‌లో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న కోలపురం శంకరయ్య (42) కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవలే శస్త్ర చికిత్స జరగగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. పద్మనగర్ గ్రామపంచాయతీలో శంకరయ్య పారిశుధ్య కార్మికుడిగా, తర్వాత ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య లస్మవ్వ, కుమారుడు కూతురు ఉన్నారు. సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు నివాళి అర్పించారు. జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు రవి, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, తదితరులున్నారు.

జోరుగా ఎండుమిర్చి విక్రయం



వేములవాడ: ప్రస్తుతం ఎండు మిర్చి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ మండలాలకు చెందిన రైతులు సోమవారం మిర్చిని తీసుకొచ్చి వేములవాడ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఇలా కుప్పలుగా పోసి అమ్మకాలు సాగించారు. కిలోకు రూ.200 చొప్పున అమ్మకాలు సాగించనట్లు రైతులు, స్థానికులు తెలిపారు.

వేతనాలు అందేదెప్పుడో?

- నాలుగు నెలలుగా జీపీ కార్మికులకు అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



మురుగుకాల్వను శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది (ఫైల్)

వీర్నపల్లి: గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నామని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు నెలలుగా..

గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామాల వీధుల్లోని చెత్తచెదారం ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంటారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకే విధులకు హాజరై సాయంత్రం వరకు వీధుల్లోని చెత్తా చెదారం , డ్రైనేజీలను శుభ్రంచేస్తారు. సకాలంలో జీతాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ.8500..

గ్రామాల్లో 500లోపు జనాభా ఉంటే ఒకరిని, వెయ్యిలోపు జనాభా ఉంటే ఇద్దరిని, వెయ్యికంటే ఎక్కువ జనాభా ఉంటే ముగ్గురిని గ్రామపంచాయతీల్లో నియమించి వారికి నెలకు రూ.8,500 చొప్పున వేతనం అందిస్తున్నారు. ఇంటి పన్ను, ఇతర ఆదాయం నుంచి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. కానీ చాలా గ్రామ పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది.

జీతాలు చెల్లిస్తాం



పారిశుధ్య కార్మికులకు గ్రాంట్ రాకపోవడంతో జీతాల చెల్లింపు ఆలస్యమైంది. వారికి రావాల్సిన నాలుగు నెలల జీతాలలో రెండునెలల జీతాలు చెల్లించాం. ఇప్పుడు కేవలం రెండునెలల జీతాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు కూడా గ్రాంట్ రావడంతో వారిఖాతాలో జమ చేస్తాం.

– నరేశ్ కుమార్ ఎంపీవో, వీర్నపల్లి

ఇబ్బందిగా ఉంది



నేను డిగ్రీ చదివాను. గ్రామంలో 23 ఏళ్లుగా కారోబార్‌గా తక్కువ వేతనంతో పనిచేస్తున్నా. ప్రభుత్వం ఇస్తున్న వేతనం సరిపోవడం లేదు. పెరిగిన ధరలకు తోడు తక్కువ వేతనంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. గత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యలు పట్టించుకోవాలి.

– శేఖర్ కారోబార్, వన్‌పల్లి

వేతనాలు చెల్లించాలి



కార్మికులకు గ్రామ పంచాయ తీ నిధులతో సంబంధం లే కుండా నేరుగా కార్మికుల ఖా తాలో జీతాలు జమచేయాలి. మల్టీ పర్పస్ వి ధానం రద్దుతోపాటు జీవో నెంబర్ 51ను రద్దు చేయాలి. కార్మికులను ప్ర భుత్వ ఉద్యోగులగా గుర్తించి ఉద్యోగ భద్రత క ల్పించాలి. సమ్మెకాలంలో చేసిన జీతాలు చెల్లించాలి.

– అరుణ్ కుమార్, సీఐటీయూ నాయకుడు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

గంభీరావుపేట: మండలంలోని సింగసముద్రంలో చేపల వేటకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎల్లారెడ్డిపేటకు చెందిన పెంటం అనిల్‌కుమార్ (48) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనిల్‌కుమార్ ఈనెల 4న సింగసముద్రంలో చేపలవేటకు వెళ్లి తిరిగి వస్తుండగా.. గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. క్షతగాత్రున్ని ముందుగా ఎల్లారెడ్డిపేట, కరీంనగర్ ఆసుపత్రులకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

నిరుపయోగంగా వాటర్ కూలర్



కొలనూర్ గ్రామ పంచాయతీలో నిరుపయోగంగా వాటర్ కూలర్

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ నిరుపయోగంగా మారింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామపంచాయతీ కార్యాలయానికి వాటర్ కూలర్ ఉచితంగా అందజేశారు. కొంతకాలంగా వాటర్ కూలర్ పనిచేయ డం లేదు. ప్రస్తుతం వేసవి కావడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. వాటర్ కూలర్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

వేములవాడరూరల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల దోహదపడతాయని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలం తుర్కాషినగర్‌లో సోమవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు, ఇతర ఎలాంటి సంఘటనలు జరగకుండా నియంత్రించ్చన్నారు. ఎస్సై మారుతి మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా సమాచారం అందించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఆంగ్లం సబ్జెక్టుపై పట్టు సాధించేలా కళాశాలలో ఫ్రీ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్లు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తెలిపారు. ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాణించాలంటే ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రావీణ్యం ఉండాలన్నారు. విద్యార్థులు కోర్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఇంగ్లీషు విభాగం ఇన్‌చార్జి ఆంజనేయులు, లెక్చరర్లు రజిత, శ్రావణ్‌కుమార్, ధర్మపురి, శ్రీవల్లి, వాణి, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, శైలజ, రాజేష్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



ఎల్లారెడ్డిపేట: గుండారంలో విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



వీర్నపల్లి: రంగంపేట ప్రభుత్వ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు

బోయినపల్లి/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/రుద్రంగి/వీర్నపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆయా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. పాఠశాలలను మామిడి తోరణాలతో అందంగా అలంకరించి ఉగాది పచ్చడిని విద్యార్థులకు అందించారు. అనంతరం పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కోట సతీశ్‌కుమార్ సహకారంతో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు పయ్యావుల రామచంద్రం మాట్లాడుతూ.. వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ నాయిని భాస్కర్‌రెడ్డి, సభ్యులు రావుల మల్లారెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, నంది కిషన్, పెంజర్ల రవి, దేవయ్య, కృష్ణారెడ్డి, చేపూరి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు, స్థానికుల దాహార్తి తీర్చేందుకు సోమవారం ఆలయ ప్రాంతంలో మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఇటీవల ఓ భక్తుడు ఫిట్స్‌తో మృతిచెందడం తెలిసిందే. దీంతో పాత మిత్రులంతా కలిసి ఓ చలివేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు ట్రస్ట్ ప్రతి నిధులు మోటూరి మధు, కొమ్మ నటరాజ్, గజ్జెల రాజశేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మజ్జిగ పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు





మార్కెట్‌లో ఉగాది సందడి

సిరిసిల్లకల్చరల్: ఉగాది పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పండుగ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. చింతపండు, మామిడికొమ్మలు, కాయలు, పువ్వులు, బెల్లం, కుండల వంటి పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక సామగ్రిని విక్రయించేందుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల రైతులు భారీగా వచ్చారు.